క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన దేవోజు శారదమ్మ అనారోగ్యంతో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి శనివారం ఉదయం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

'డబుల్' ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక

మంచాల: మండల పరిధిలోని నోముల గ్రామంలో డబుల్ బెడ్ రూం ఇళ్లకు శనివారం గ్రామసభలో లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. గ్రామంలో 30 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తహసీల్దార్ అనిత తెలిపారు. మంచాల, లింగంపల్లి గ్రామాల్లో గ్రామ సభలు వాయిదా పడ్డాయి. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమేశ్, సర్పంచ్ బాలరాజ్, ఎంపీటీసీ సభ్యుడు జయానందం, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దండేటికార్ రవి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్‌ల వితరణ



కంట్రోలర్‌కు ఫ్యాన్‌లు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ఆమనగల్లు: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఫ్యాన్‌లు అందించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆర్టీసీ కంట్రోలర్ జగదీశ్‌కు లయన్స్‌క్లబ్ సభ్యులు ఫ్యాన్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

'అవినీతికి పాల్పడిన వారిపై కేసులు పెట్టాలి'



మోకాళ్లపై నిల్చుని నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

యాచారం: దళితబంధు పథకంలో అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీరు చేపట్టిన నిరసన దీక్ష శనివారంతో మూడు రోజులకు చేరుకుంది. మోకాళ్లపై నిల్చుని నిరసన వ్యక్తం చేశారు. అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలను వెంటనే బాధ్యతల నుంచి తొలగించాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ దీక్షలో నాయకులు కృష్ణ, శ్రీకాంత్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

'యువ సమ్మేళనం' వాయిదా



మాట్లాడుతున్న రాజు

ఇబ్రహీంపట్నం: బీఆర్ఎస్ యువ సమ్మేళనం వాయిదా వేసినట్లు పార్టీ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు జెర్కొని రాజు, బీఆర్ఎస్వీ సంఘం అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్ తెలిపారు. శనివారం వారు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి సూచన మేరకు ఈ నెల 9న నిర్వహించాల్సిన సమ్మేళనం ఈ నెల 20కి వాయిదా వేసినట్లు తెలిపారు.

రోడ్డుపైకి జింకలు

యాచారం: నాగార్జునసాగర్ – హైదరాబాద్ రహదారిపై గునుగల్ అటవీ ప్రాంతంలో జింకల సంచారం ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. అటవీ ప్రాంతంలో ఉండాల్సిన జింకలు తరచూ రోడ్డు పక్కకు వస్తున్నాయి. సాగర్ రోడ్డుపై రాకపోకలు సాగించే వారు కొద్ది సేపు తమ వాహనాలను నిలిపి జింకలను ఆసక్తిగా చూస్తున్నారు. గునుగల్ అటవీ ప్రాంతంలో వందలాది జింకలు ఉన్నాయి. అవి ప్రమాదం బారిన పడకుండా రోడ్డుకు ఇరువైపులా కంచె ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



సాగర్ రోడ్డుకు సమీపంలో సంచరిస్తున్న జింక

మట్టి తరలింపుపై ఆగ్రహం

- సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు
- ఎమ్మెల్యే గైర్హాజరుకు నిరసనగా నేలపై బైఠాయించిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు



సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

తలకొండపల్లి: రాత్రిళ్లు అక్రమంగా మట్టి తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్‌తో పాటు పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తిర్మణి నిర్మలాగౌడ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన జవాన్లకు నివాళి అర్పించారు. సమావేశానికి ఎమ్మెల్యే హాజరు కాకపోవడంతో అందుకు నిరసనగా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు నేలపై బైఠాయించారు. అనంతరం ఎమ్మెల్యే రావాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా మండలంలోని పలు గ్రామాల చెరువుల్లో మట్టి తరలిస్తున్న ఎందుకు పట్టించుకోవడం లేదు? మీ వాటా ఎంత? అంటూ జెడ్పీటీసీ సభ్యుడు, ఎంపీపీ ఇరిగేషన్ అధికారులను సభలో ప్రశ్నించారు? యంత్రాలతో నింపి వందల వాహనాల్లో మట్టిని తరలిస్తున్నా పోలీసులు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సభ్యులు మండిపడ్డారు. వాల్టా చట్టం ప్రకారం నిబంధనలు పాటించాలని, లేకుంటే సంబంధిత అధికారులపై చర్య తీసుకోవాలంటూ కోర్టును ఆశ్రయిస్తామన్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ కుమార్, రమేశ్‌యాదవ్, రఘుపతి, ఎంపీటీసీ సభ్యుడు అంబాజీ ఏఈ కటారియాను కోరారు. ప్రాథమిక ఆస్పత్రి అధ్వానంగా మారిందని ఉందని జెడ్పీటీసీ సభ్యుడు సభ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామ పంచాయతీ పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ, తమ అనుమతి లేకుండా జీఎస్టీ, విద్యుత్ బిల్లులు డ్రా చేయడం ఎంతవరకు సమంజసమని సర్పంచ్ కుమార్, రఘుపతి, లలితమ్మ, రమేష్‌యాదవ్, శ్రీశైలం, కిష్టమ్మ సభలో ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ శ్రీకాంత్, పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, ఏఓ రాజు, ఎంఈఓ సర్దార్‌నాయక్, సీడీపీఓ సక్కుబాయి, ఏఈలు విద్యాసాగర్, కటారియా, సీనియర్ అసిస్టెంట్ బాలవర్ధన్, వైద్యులు శంకర్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

'యువ సంఘర్షణ సభ'కు తరలిరండి

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: నగరంలోని సరూర్‌నగర్ మైదానంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 8న నిర్వహించ తలపెట్టిన 'యువ సంఘర్షణ' సభకు నిరుద్యోగ యువత, విద్యార్థులు, ప్రజానీకం పెద్ద ఎత్తున తరలిరావాలని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యా నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. యువ సంఘర్షణ సభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ హాజరవుతున్నారని తెలిపారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో నియంత పాలన కొనసాగుతోందని.. తొమ్మిదేళ్లుగా నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చలగాటమాడుతోందని ఆరోపించారు. యువ సంఘర్షణ సభకు యువత పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, కో ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, పట్టణ అధ్యక్షుడు రాంచందర్‌నాయక్, నాయకులు భానుకిరణ్, యాదయ్యగౌడ్, లక్ష్మయ్య, యాదయ్య, రాజేశ్, భరత్‌యాదవ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

యువత తరలిరావాలి

తలకొండపల్లి: ప్రభుత్వం అసమర్థ పాలనకు నిరసిస్తూ నిర్వహించ తలపెట్టిన యువ సంఘర్షణ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 8న నగరంలోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే ఈ సభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ హాజరవుతున్నారని చెప్పారు. నిరుద్యోగులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి అంజయ్య గుప్తా, మహేశ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాములు, సర్పంచ్ శ్రీశైలం, సోషల్ మీడియా అసెంబ్లీ కన్వీనర్ అజీం, యూత్ మండలాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షుడు విష్ణుగౌడ్, మైనార్టీ నాయకుడు ఆరీఫ్, నరేశ్, శివ, సాయినాథ్, చెన్నకేశవులు పాల్గొన్నారు.

మాసబ్ చెరువును కాపాడండి



వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష నాయకులు

అఖిలపక్ష నాయకుల డిమాండ్

తుర్కయంజాల్: మున్సిపల్ పరిధిలోని మాసబ్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, బీఎస్పీ, టీడీపీ, సీపీఎం నాయకులు డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. డంప్ చేసిన మట్టిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి చెరువును కాపాడాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఐలయ్య, బీఆర్ఎస్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కళ్యాణ్‌నాయక్, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రమేశ్, బీఎస్పీ మున్సిపల్ అధ్యక్షుడు బాబు, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు వీరేశం, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు నర్సింహగౌడ్, కాంగ్రెస్ నాయకులు శివమార్, వివిధ పార్టీ నాయకులు పురుషోత్తం, చంద్రశేఖర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌ల సమ్మెతో గ్రామాల్లో ఇబ్బందులు

- ప్రభుత్వం తక్షణమే రెగ్యులరైజ్ చేయాలి
- జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్



తలకొండపల్లి: ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జేపీఎస్‌ల ఆందోళన

తలకొండపల్లి: పంచాయతీ కార్యదర్శుల సమ్మెతో గ్రామాల్లో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ అన్నారు. టీపీఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం కందుకూరు, మహేశ్వరం, కడ్తాల్, ఆమనగల్లు, తలకొండపల్లి మండల పరిధిలోని పంచాయతీ జూనియర్ కార్యదర్శులు, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు తలకొండపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో బైఠాయించారు. ఈ సమ్మెకు జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, ఎంపీపీ తిర్మని నిర్మలాశ్రీశైలంగౌడ్ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం జేపీఎస్, ఔట్ సోర్సింగ్ కార్యదర్శుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శుల పనితీరుతోనే పంచాయతీలకు అవార్డులు వచ్చాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ అనిల్ మాట్లాడుతూ.. సీఎం హామీ మేరకు వారిని వెంటనే రెగ్యులరైజ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. అనంతరం వీఓఏల సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. అనంతరం జేపీఎస్‌లు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు జావిద్, మండలాధ్యక్షుడు రమేశ్, రాము, మురళీమోహన్, శివకుమార్, వాజిద్, వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్, ఓపీఎస్‌ల శ్రమదానం

ఇబ్రహీంపట్నం: ఔట్ సోర్సింగ్, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె శనివారంతో తొమ్మిది రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు శ్రమదానం చేశారు. ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ కార్యాలయంలోని పిచ్చి మొక్కలు, చెత్త తొలగించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

అక్రమంగా మద్యం సరఫరా

రిసార్ట్ నిర్వాహకులపై కేసు

కడ్తాల్: అనుమతులు లేకుండా రిసార్ట్‌లో అక్రమంగా మద్యాన్ని సరఫరా చేసినందుకు నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సీతారాంరెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్దావేములోనిబావి తండా వద్ద బిగ్‌డాడీ రిసార్ట్ నిర్వాహకులు కస్టమర్లకు అక్రమంగా మద్యాన్ని సరఫరా చేస్తూ న్యూసెన్స్ చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు శనివారం స్థానిక పోలీసులు రిసార్ట్‌ను తనిఖీ చేశారు. తనిఖీల్లో ఐదు బీర్‌బాటిల్స్, నాలుగు రాయల్‌స్టాగ్ ఆఫ్ బాటిల్స్, 10 ఖాళీ బీరు బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రిసార్ట్ నిర్వాహకులు లక్ష్మణ్ నాయక్, రాహుల్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు. ఆమనగల్లు సర్కిల్ పరిధిలోని రిసార్ట్‌లలో, గెస్ట్ హౌస్‌లలో అనుమతులు లేకుండా మద్యం సరఫరా చేసి ఫంక్షన్‌లు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఆమనగల్లు సీఐ ఉపేందర్ హెచ్చరించారు.

పేకాటకు సహకరించిన గెస్ట్‌హౌస్ యజమానిపై..

మండల పరిధిలోని మైసిగండి ఆలయ సమీపంలోని డీఎల్ఆర్ శిల్పా గెస్ట్ హౌస్ యాజమాని రామవత్ లక్ష్మణ్‌నాయక్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సీతారాంరెడ్డి శనివారం తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఎస్ఓటీ, పోలీసులు సంయుక్తంగా చేసిన దాడిలో పేకాడుతున్న 25 మందిని అరెస్టు చేసిన విషయం విదితమే. దర్యాప్తులో భాగంగా పేకాడేందుకు గెస్ట్‌హౌస్ యజమాని లక్ష్మణ్‌నాయక్ సహకరించినట్లు తేలడంతో ఆయనపై కేసు నమోద చేశామన్నారు.

విద్యుదాఘాతంతో లైన్‌మెన్‌కు గాయాలు

తలకొండపల్లి: విద్యుదాఘాతంతో లైన్‌మెన్ గాయపడ్డాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. మండల కేంద్రంలో లైన్‌మెన్‌గా పని చేస్తున్న వశ్యా విధుల్లో భాగంగా విద్యుత్ పోల్ ఎక్కి వైర్లు సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో స్తంభం పై నుంచి కింద పడ్డాడు. దీంతో వశ్యా తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన చికిత్స నిమిత్తం నగరంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. లైన్ క్లియర్ చేసుకుని స్తంభం ఎక్కిన తర్వాత వైర్లు సరి చేస్తుండగా ఇవెంటర్ నుంచి కరెంట్ రిటన్ సప్లై కావడంతో ప్రమాదం జరిగిందని ఏఈ కటారియా తెలిపారు.

గొర్రెల దొంగలు అరెస్టు?

ఇబ్రహీంపట్నం రూరల్: రాత్రిళ్లు గొర్రెలు ఎత్తుకెళ్తున్న ముఠాను ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి దొంగిలించిన గొర్రెలను పెద్ద సంఖ్యలో స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు సులభంగా డబ్బు సంపాదించేందుకు ఐదుగురు దుండగులు ముఠాగా ఏర్పడ్డారు. వీరు ఆదిబట్ల, అబ్దుల్లాపూర్‌మెట్, షాద్‌నగర్ ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు సమాచారం. ఐదురుగు ముఠాలో నలుగురిని అరెస్టు చేయగా మరొకరు పరారీలో ఉన్నట్లు తెలిసింది. పూర్తి స్థాయిలో విచారించిన తర్వాత ఆదివారం వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు

జెడ్పీటీసీ సభ్యుడు జంగారెడ్డి

కందుకూరు: అర్హులందరికీ సంక్షేమఫలాలు అందించేందుకు మంత్రి సబితారెడ్డి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కల్యాణ్‌నగర్‌కు చెందిన యాదగిరికి సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.60వేల చెక్కు మంజూరైంది. ఈ చెక్కును శనివారం ఆయన తన కార్యాలయంలో లబ్ధిదారుడికి చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గం యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్ల కార్తీక్, సోషల్ మీడియా కన్వీనర్ బొక్క దీక్షిత్‌రెడ్డి, కార్యాలయ కార్యదర్శి వెంకటేశ్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న జంగారెడ్డి తదితరులు

గుండెపోటుతో సెర్ప్ ఏపీఎం మృతి



నివాళి అర్పిస్తున్న ఎంపీపీ సుకన్య తదితరులు

యాచారం: గుండెపోటుతో ఏపీఎం సతీశ్(45) శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఏపీఎం కుటుంబ సభ్యులు సరూర్‌నగర్‌లో నివసిస్తున్నారు. ఆయనకు తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో తీవ్ర అలసట, ఛాతిలో నొప్పి రావడంతో నిద్రలేచి ఇంట్లో కూర్చున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే సతీశ్ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడికి భార్య లక్ష్మి, కొడుకు, కూతురు ఉన్నారు. శుక్రవారం సతీశ్ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా ఉన్నతాధికారుల నుంచి ఇబ్బందులు వస్తున్నాయని మానసికంగా కృంగిపోతున్నట్లు వాపోయాడు. అంతలోనే ఆయన మృతి చెందడంతో అధికారులు, ప్రజాప్రతినిధులను కలిచివేసింది. శనివారం యాచారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఎంపీపీ కొప్పు సుకన్య, పలు శాఖల అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ఎంపీటీసీ సభ్యుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్



విరాళం అందజేస్తున్న పాండుగౌడ్

ఆమనగల్లు: ప్రతీ ఒక్కరు దైవచింతన అలవర్చుకోవాలని ఎంపీటీసీ సభ్యుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, మాడ్గుల ఎంపీటీసీ కొత్తపాండుగౌడ్ సూచించారు. మాడ్గుల మండలం నర్సాయిపల్లి గ్రామంలో యాదవసంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి దేవాలయ నిర్మాణ పనులను శనివారం ఆయన యాదవసంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం ఆలయ నిర్వాహకులకు అందించారు. అనంతరం పాండుగౌడ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఆలయాల నిర్మాణంతో భక్తిభావం పెంపొందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ రాములుయాదవ్, స్థానిక నాయకులు, యాదవసంఘం నాయకులు గౌతమ్‌గౌడ్, యాదయ్య, పరశురామ్, యాదయ్య, ముత్యాలు, వాసుదేవ్, నిరంజన్, అంజయ్య, వెంకటయ్య, నర్సింహ, గోవింద్, మల్లేశ్, రమేశ్, రోశయ్య, శ్రీశైలం, కొండల్ పాల్గొన్నారు.

దళారులకు విక్రయించి మోసపోవద్దు

ఆమనగల్లు మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని ఆమనగల్లు మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి గిట్టుబాటుధర పొందాలని సూచించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విక్రయకేంద్రానికి వరిధాన్యం తీసుకువచ్చిన రైతులతో ఆయన మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు ఎవరూ అధైర్యపడవద్దని, రైతులకు కేసీఆర్ ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. రైతులు తీసుకువచ్చే ధాన్యాన్ని ఆరబోసి తేమశాతం సరిగా వచ్చేలా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి సరోజ, సూపర్‌వైజర్ మంగ శ్రీశైలం, మార్కెట్ సిబ్బంది, సింగిల్‌విండో కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

మానవ అక్రమ రవాణా నేరం



ర్యాలీ నిర్వహిస్తున్న బడంగ్‌పేట డిగ్రీ కళాశాల విద్యార్థులు

ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక

రంగారెడ్డి జిల్లా: ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో కార్పొరేషన్‌లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టక్ రాధిక మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతి పెద్ద నేరంగా పరిగణించపడుతుందన్నారు. నేడు ఎంతో మంది మహిళలు, విద్యార్థినులు ఈ అక్రమ రవాణాకు గురిఅవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రజలను, గ్రామీణ ప్రాంత సమాజాన్ని అప్రమత్తం చేయాలని కోరారు. ఆర్థిక స్థితిగతులే ఈ అక్రమ రవాణాకు కారణాలుగా అని చెప్పవచ్చన్నారు. ప్రజ్వల సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ కృష్ణ మాట్లాడుతూ.. అక్రమ రవాణా, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా పద్మశ్రీ డాక్టర్ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో 27 ఏళ్లుగా పోరాడి ఇప్పటి వరకు 26,500 మంది అమ్మాయిలను కాపాడామన్నారు. వారికి పునరావాసం కల్పించామన్నారు. అలాగే విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి సమాజ జాగృతి సంఘాలను ఏర్పాటు చేశామని వివరించారు. అనంతరం లఘు చిత్రాల ద్వారా విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

క్రీడల ఆసక్తి పెంచుకోవాలి



వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న యాచారం సీఐ లింగయ్య

సీఐ లింగయ్య

యాచారం: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని యాచారం సీఐ లింగయ్య సూచించారు. మండల పరిధిలోని చింతపట్ల గ్రామంలో స్పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ తెలంగాణ సహకారంతో వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని శనివారం సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో చింతపట్ల గ్రామంలో ఉచిత శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. అన్ని గ్రామాల్లో ఇలాంటి శిబిరాలను నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల సభ్యులు ముందుకు రావాలని కోరారు. యాచారం పోలీస్ స్టేషన్ నుంచి క్రీడాకారుల కోసం అవసరమైన సహకారాన్ని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చింతపట్ల మన ఊరు మన బడి వ్యవస్థాపకుడు ఎండీ సాబేర్, పాఠశాల చైర్మన్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.